క్లుప్తంగా

భద్రాచలంలో ఎస్పీ పూజలు



నారాయణపేట రూరల్: భద్రాచలం సీతారామస్వామిని సోమవారం ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. భార్య శ్రీదేవి, కుమార్తె ఉమాహారతితో కలిసి వెళ్లారు. ఆలయంలో స్వామి, అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ ఈఓ రమాదేవి శాలువాతో వారిని సన్మానించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నారాయణపేట రూరల్: యువసేన ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు మండలంలోని తిర్మలాపూర్‌లో సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడుతూ.. యువత చదువు, ఉద్యోగంతో పాటు క్రీడల్లో ప్రావిణ్యం సంపాదించాలన్నారు. కార్యక్రమంలో నర్సింహ, వెంకటేష్, సురేష్‌నాయక్, సీతాసుదర్శన్, జేవీరావు, దత్తు, రమేష్‌నాయక్, రాములు, మల్లికార్జున్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

పార్ట్ టైం స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట రూరల్: న్యాయమైన సమస్యల కోసం పార్ట్ టైం స్వీపర్లు చేస్తున్న నిరసనలపై ప్రభుత్వం దృష్టిసారించాలని పీఆర్‌టీయూ నాయకులు నర్సింహారెడ్డి, జనార్దన్ రెడ్డి, లక్ష్మారెడ్డి సోమవారం డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో ప్రభుత్వ పాఠశాలలను శుభ్రం చేస్తూ, విద్యార్థులు, టీచర్లకు అవసరమైన సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. న్యాయమైన డిమండ్లను సానుకూలంగా స్పందించి వెంటనే చర్చల ద్వారా పరిష్కరించాలని కోరారు.

చెరువుకు మరమ్మతు ప్రారంభం



ధన్వాడ: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో మరమ్మతు పనులను సోమవారం ప్రారంభించారు. అధ్యక్షులు నర్సింహులు నాయుడు మాట్లాడుతూ చెరువు తూముతో పాటు కంప చెట్లు ఇతర వాటిని తొలగించి మరమ్మతు చేపట్టినట్లు తెలిపారు.

ఉద్యమంతోనే మండలం సాధించుకుందాం

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండలో 69వ రోజు నిరసన దీక్షలు కొనసాగాయి. సోమవారం మహిళా సంఘం సభ్యులు దీక్షలో కూర్చోగా సాధన సమితి మహిళా సభ్యులు దండలు వేసి దీక్షలు ప్రారంభించారు. బీజేపీ నాయకుడు కెంచె శ్రీనివాసులు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు తర్వాత పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలు, మండలాలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన వెంటనే కోటకొండ గ్రామస్తులు అన్ని అర్హతలు ఉన్న తమ గ్రామాన్ని మండలం చేయాలని ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం తిరస్కరించిందని విమర్శించారు.

కంటి వైద్య శిబిరం



కోస్గి: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు భాస్కర్ గౌడ్ 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 35 మందికి కంటిలో శుక్లాలు గుర్తించారు. కంటి శుక్లాలు ఉన్న వారికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో వెంకట్రాములు, వెన్న శేఖర్, పూర్ణచందర్ యాదవ్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు కిసాన్ మోర్చా నిరసన దీక్ష

నారాయణపేట: భారతీయ జనతా కిసాన్ మోర్చ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన దీక్షను చేపడుతున్న రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. రైతులకు ఇస్తామన్న రుణమాఫీ రూ.లక్ష తక్షణమే చేయాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాలబెలగుందీశ్వరుడు



జిల్లా కేంద్రంలో పూజలు చేస్తున్న భక్తులు

నారాయణపేట: చౌడేశ్వరి మాత జయంతి వేడుకలను బ్రహ్మన్‌వాడి తొగట వీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో సోమవారం భక్తులు అమ్మవారి డోలరోహణ వైభవంగా నిర్వహించారు. మహాఅభిషేకం, పసుపు కుంకుమతో ప్రత్యేక అభిషేకం, పుష్పాలంకరణ నైవేద్యం, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకొని తీర్థప్రసాదలను స్వీకరించారు.

కోస్గి: పట్టణంలోని చౌడేశ్వరిదేవి జయంతిని పురస్కరించుకుని తొగుట వీర క్షత్రీయ సమాజం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇసుక బావి ఒడ్డున ఉన్న అమ్మవారి ఆలయంలో సోమవారం అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు..

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలలో సోమవారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రాల సరిహద్దులోని కాలబెలగుంది క్షేత్రంలో స్వామివారికి సుప్రభాతం, రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తరనామావళి, అభిషేకం, అలంకరణ, హారతి తదితర పూజలు చేశారు. భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదానం చేపట్టారు. అదేవిధంగా పట్టణంలోని అయ్యప్పస్వామి, సింగార్‌బేస్ శివలింగేశ్వర స్వామి దేవాలయం, మహంకాళివీధి శివాలయం, తాయమ్మగుడితో పాటు మండలంలోని ఎక్లాస్‌పూర్ తిమ్మప్ప ఆలయం, జిలాల్‌పూర్ కర్రెప్పతాత గుడిలో ప్రత్యేక పూజలు చేశారు.

ఊట్కూరు: అయ్యప్పస్వామి ఆశ్రమంలో అమావాస్య సందర్భంగా పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామికి అంగపూజ, అష్టోత్తరం, పంచామృతాభిషేకం, మహామంగళహారతి, భజన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



కోస్గిలో..



ఊట్కూరులో..

నాణ్యతతో పనులు చేపట్టండి



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కోస్గి: మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు బీసీ కాలనీ నుంచి ముంగిమళ్ల వరకు చేపట్టిన రోడ్డు పనులను నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. 6వ వార్డు పరిధిలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి కొత్తగా రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శిరీష, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామకృష్ణ, భీంరెడ్డి, రాజేష్, గందె ఓం ప్రకాష్, ప్రతాప్‌రెడ్డి, అజీజ్, కేశవులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి

మక్తల్: ఉపాధ్యాయుల సమస్యలపై తపస్ ఆధ్వర్యంలో 18 నుంచి 22 వరకు సంతకాల సేకరణ జాగరణ కార్యక్రమం ఉంటుందని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రతి నెల 1వ తేదీన రావాల్సిన జీతం ఎప్పుడు వస్తుందోనని, దీంతో ఉపాధ్యాయులు అయోమయంలో పడ్డారన్నారు. కార్యక్రమంలో భీంరెడ్డి, నర్సిరెడ్డి, నర్సింహులు, రాకేష్, రవీందర్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం



క్రీడాకారులతో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: జాతీయ ఖోఖో దినోత్సం సందర్భంగా నిర్వహించిన ఖోఖో పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సోమవారం బహుమతులను అందజేశారు. జిల్లా స్థాయి బాలికల ఖోఖోలో ద్వితీయ స్థానం పొందిన కున్సి పాఠశాల బాలికలకు నగదు, ట్రోఫీ అందజేశారు. జాతీయ స్థాయికి ఎంపికైన బాలికలకు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో గోపాలం, అంబ్రేస్, తాన్‌సింగ్లను అబినందించారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

నారాయణపేట రూరల్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారిన సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని యూఎస్‌పీసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ ఎదురుగా వాల్‌పోస్టర్ విడుదల చేసి మాట్లాడారు. 2003 తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి రిటైర్మెంట్ తర్వాత పింఛన్ సౌకర్యం లేదని, దీన్ని వల్ల కుటుంభ పోషణకు ఇతరులపై ఆధారపడాల్సిన దుస్థితి వస్తుందన్నారు. వెంటనే పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఐక్య సదస్సుకు పెద్ద సంఖ్యలో టీచర్లు తరలిరావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా సుందరయ్య కళాభవన్‌లో జాయింట్ ఫోరం రెస్టోరేషన్ ఆఫ్ ఓపీఎస్ పేరుతో కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో శివరాములు, రెడ్డప్ప, సూర్యచంద్ర, బాలాజీ, భీమయ్య, గోవిందు, గజలప్ప, వెంకట్‌నాయక్, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట ధర్నా

నారాయణపేట: పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండి వైఖరి నిరసిస్తూ మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ధర్నాకు ఉదయం 10 గంటల వరకు నియోజకవర్గంలోని అన్ని పంచాయతీ ఉద్యోగ, కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

న్యాయవాదికి సన్మానం

మక్తల్: అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన న్యాయవాది ఆడేం శ్రీనివాసులును సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి సన్మానం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రవికుమార్, గోవర్ధన్ పాల్గొన్నారు.

అధ్యక్షుడికి..

నారాయణపేట: నియోజకవర్గ ముదిరాజ్ జర్నలిస్టు సంఘం గౌరవ అధ్యక్షుడు పడిగే అనంతరం, అధ్యక్షుడు నక్క శ్రీనివాస్‌లను సోమవారం జిల్లా కేంద్రంలో పలువురు బీఆర్ఎస్ మండల నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌నాయక్, సయ్యద్ అరిఫ్ ఖాద్రీ, గోపాల్ నాయక్, రవిగౌడ్, గోవిందు, రాములు, రాజు నాయక్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం ఎన్నిక

దామరగిద్ద: గౌడ సంఘం కన్వీనర్‌గా భీమయ్యగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో కన్వీనర్‌గా భీమయ్యగౌడ్, కో కన్వీనర్‌గా రాజేశ్వర్‌గౌడ్ ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ గౌడ కులస్తుల సంక్షేమానికి ఎల్లప్పుడు వెన్నంటే ఉంటామన్నారు. రానున్న రోజుల్లో గ్రామ కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నారాయణగౌడ్, ఆనంద్‌గౌడ్, కృష్ణగౌడ్, వరదరాజులుగౌడ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

దామరగిద్ద: ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయ విజ్ఞాన సదస్సు పారా లీగల్ వలంటీర్ రూపిక అన్నారు. సోమవారం మండలంలోని మల్‌రెడ్డిపల్లిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయ సహాయం, న్యాయవాద తీర్పు అమలు, బాల్యవివాహాల నిర్మూలన, బాలకార్మిక చట్టం, విత్తన ఎరువులు చట్టం వాటిపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారం చెత్త వేయరాదు



షాషాబ్‌గుట్టలో అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో ఎక్కడబడితే అక్కడే చెత్తాచెదారం పారవేయొద్దని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, గురులింగం సూచించారు. సోమవారం మున్సిపాలలిటీలో 23, 40, 42వ వార్డుల పరిధిలోని శివశక్తినగర్, మేకలబండ, షాషాబ్‌గుట్ట తదితర ప్రాంతాల్లో చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమలు పెరిగి డెంగీ బారిన పడే ప్రమాదం ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కచ్చితంగా తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించడానికి వచ్చిన స్వచ్ఛ ఆటోలకు మాత్రమే ఇవ్వాలన్నారు పేర్కొన్నారు.

గురుకుల టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ పార్క్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న టీచర్లు


నారాయణపేట రూరల్: గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా సెక్రెటరీ బాలాజీ డిమాండ్ చేశారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ పార్క్ ఎదురుగా ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని, గురుకుల టీచర్లపై పనిభారం, మానసిక ఒత్తిడి తగ్గించాలని, హెల్త్‌కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం టీచర్లకు బేసిక్ పే అమలు చేయాలని, సీఆర్‌టీల సర్వీసును బట్టి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 5న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు గురుకుల టీచర్లు కదిలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శివరాములు, బీమయ్య, గోవింద్, గురుకుల టీచర్లు రమేష్, హరిప్రసాద్, శ్రీనివాసులు, ఆనంద్, నరేష్, అరుణ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత




ఆత్మకూర్: నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురయిన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి సోమవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. పట్టణంలోని పీజేపీ క్యాంపులో నివాసం ఉంటున్న వెంకటస్వామి నెల రోజుల క్రితం ఆత్మకూర్ సంతలో తన సెల్‌ఫోన్ చోరీకి గురయ్యిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని నిజామాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేసుకున్నారు. సెల్ ఫోన్లు చోరీకి గురయిన, లేదా పోగొట్టుకున్నా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని సూచించారు.

పెద్దగుట్టకు ఉత్సవ శోభ



బాదేపల్లి పెద్దగుట్ట



శయనభంగిమలో రంగనాథస్వామి

జడ్చర్ల టౌన్: నియోజకవర్గ కేంద్రంలోని 44, 167వ నంబరు జాతీయరహదారులకు కిలోమీటరు దూరంలో ఉన్న బాదేపల్లి పెద్దగుట్ట పై నేటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా శ్రావణమాసంలో ఆలయంలో నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఆయా ప్రాంతాలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు. రెండేళ్ల కిందటి వరకు శ్రావణమాసంలో మాత్రమే ఉత్సవాలు నిర్వహించే ఆనవాయితీ ఉండేది. కానీ ప్రస్తుతం ఆలయంలో దూపదీపనైవేద్యాలు నిర్వహిస్తుండటంతో సెలవుదినాల్లోనూ భక్తుల తాకిడి పెరిగింది. అయినప్పటికీ శ్రావణమాసం పూజలకు ఎంతో ప్రత్యేక ఉంది.

గుట్టపైకి రోడ్డుమార్గం..

గుట్ట 700మీటర్ల ఎత్తులో ఉండటంతో భక్తులు మెట్ల మార్గం ద్వారా కాలినడకన పైకి చేరుకుంటారు. మొత్తం 1200మెట్లు ఎక్కి ఆలయానికి చేరుకోవాల్సి ఉండటంతో వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడేవారు. దీంతో భక్తుల సౌకర్యార్థం ఉమ్మడి రాష్ట్రంలో సీసీరోడ్డు వేసేందుకు ప్రయత్నించినా సాధ్యపడలేదు. కొంతమేర రోడ్డు ఫార్మేషన్ చేసి వదిలేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ద్ధాక మిషన్‌భగీరథ పథకం ప్రారంభం కావటంతో గుట్టపై వాటర్ రిజర్వాయర్స్ నిర్మించటంతో సీసీ రోడ్డు మంజూరైంది. రూ.1కోటి 50లక్షలతో రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. దీంతో గుట్టపైకి వాహనాల్లో చేరుకునేందుకు మార్గం సుగమం అయ్యింది.

విశాలమైన మైదానం

గుట్టపైన విశాలమైన మైదానం ఉండటంతో భక్తులు ఎంతమంది వచ్చినా ఇబ్బందులు తలెత్తవు. రాతిగుండ్లు, చెట్లు, గుండ్ల మధ్యలో ఖాళీస్థలం ఉండటంతో భక్తులు వంటావార్పు చేసుకుని సేదతీరుతుంటారు. భవిష్యత్‌లో రేకులషెడ్ల నిర్మాణం చేపట్టేందుకు మున్సిపాలిటీ నుంచి నిధులు కేటాయించారు.

పైకప్పులేని ఆలయం..

ఆలయంలో శేషతల్పముపై శయన భంగిమలో రంగనాథస్వామి భక్తులకు దర్శనం ఇస్తారు. విష్ణుమూర్తి శయన భంగిమలో భక్తులకు దర్శనం ఇచ్చే ఆలయం ఈప్రాంతంలో మరెక్కడా లేదంటే అతిశయోక్తి కాదు. శయనభంగిమలో స్వామివారు ఉండడంతో ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఏర్పడింది. కాకతీయుల కాలంలో ఈప్రాంతాన్ని పరిపాలించిన సామంతరాజు గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణాన్ని ఇక్కడ ఉన్న స్వామిని స్మరించుకొంటునే రాశారని ప్రతీతి. రంగనాయకస్వామి ఆలయం పైకప్పు లేకుండానే చూడటం గమనించవచ్చు. ఆలయానికి పైకప్పువేసేందుకు అనేకమార్లు భక్తులు యత్నించినప్పటికి అది కూలిపోవటం జరిగేది. దీంతో పైకప్పు వేయకుండా ఇనుపరాడ్లతో జాలీ ఏర్పాటు చేసి వదిలేశారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



మాట్లాడుతున్న కేశం నాగరాజ్‌గౌడ్

అమరచింత: పేదలు కలలు కన్న రాజ్యంతో పాటు వారికి సంక్షేమ పథకాలు అందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమవుతుందని, కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి సాకారమని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. యాత్ జూడో–బూత్ జూడో కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో సోమవారం ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలంటూ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ పరిపాలన రావాలన్న రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపర్చి కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. నిరుపేదలను అన్ని విధాలుగా ఆదుకుని వారి కుటుంబాల్లో వెలుగునింపిన ఘనత కాంగ్రెస్‌దే అని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఒక్క గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం స్థానిక ఎమ్మెల్యే ప్రయత్నాలు చేయట్లేదని ఎద్దేవా చేశారు. ధర్మాపురం గ్రామానికి ఇప్పటికీ రహదారి సౌకర్యం లేక ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అన్ని నియోజక వర్గాలు, గ్రామల్లో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందని తెలిపారు. కాంగ్రెస్ ఎదుగుదలను చూడలేక అధికార పార్టీ నాయకులు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, ప్రకాశం, పోషిరిగారి విష్ణు, శ్యామ్, తులసీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిల విడుదలపై జాప్యం తగదు



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఆర్టీసీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం జాప్యం చేయడం తగదని టీపీసీసీ అధికార ప్రతినిధి జి.హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్లక్ష్యంపై మండిపడ్డారు. 2013లో 0.5 శాతం పీఆర్సీ బాండ్ ఇచ్చారని, 2020 సెప్టెంబర్ 30న కాలపరిమితి ముగిసినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. 2017, 2021లలో పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. 50 వేల మంది కార్మికులు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు లీవ్‌ల విషయంలో అన్యాయం చేస్తుందన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల పక్షాన పోరాటాలు నిర్వహించనున్నట్లు వివరించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు బెనహర్, అనిత పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె



మద్దూరులో మాట్లాడుతున్న నాయకులు

మద్దూరు: పంచాయతీ కార్మికుల సమ్మె సోమవారానికి 12వ రోజుకు చేరింది. మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసినా సమ్మె శిబిరంలో మద్దూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకుడు కొండ నర్సింహులు మాట్లాడుతూ.. కార్మికుల సమ్మెపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడం శోచనీయమన్నారు. పంచాయతీ పరిశుభ్రంగా ఉండాలన్న, హరితహారం మొక్కలు పెరగాలన్న, పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాల్లో కార్మికులు కీలక పాత్ర ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, భీములు, మహిపాల్, మొగలయ్య, ఆశమ్మ, నర్సమ్మ, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరహరి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికుల సమ్మెకు పార్టీ తరుపున మద్దుతు తెలుపుతు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శివకుమార్, బాలకృష్ణ, లక్ష్మయ్యగౌడ్, ఆనంద్‌గౌడ్, వెంకట్రాములు, ఇర్ఫాన్, మల్లేష్, నరేందర్‌గౌడ్, రాముగౌడ్, సలీమ్, రాఘవేందర్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: చాలిచాలనీ వేతనాలతో సతమతమవుతున్న కార్మికుల సమస్యలు పాలకులకు పట్టవా అని పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు రాంచంద్రి ప్రశ్నించారు. సోమవారం నిరవధిక సమ్మెలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద సమ్మెను కొనసాగించారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్మికులు వివిధ రకాల నిరసన కార్యక్రమాలను చేపడుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో నర్సోజీ, శ్రీనివాస్‌గౌడ్, చిన్నయ్య, రుక్మోద్దీన్, కడపన్న తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద కార్మికులు చేపట్టిన సమ్మె 12వ రోజుకు చేరింది. సీఐటీయూ జిల్లా కన్వీనర్ గోవింద్‌రాజ్ మద్దతు పలికారు.



ధన్వాడలో..



నర్వలో..